మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర

రామప్పకు మే 14న మిస్ వరల్డ్ బృందం

ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించిన కలెక్టర్ దివాకర

ములుగు, ఏప్రిల్15 (నమస్తే తెలంగాణ) : యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని మే 14న మిస్ వరల్డ్ బృందం సందర్శించనున్నదని కలెక్టర్ టీఎస్ దివాకర తెలిపారు. ఏర్పాట్లపై మంగళవారం ఆయన అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి మాట్లాడారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొననున్న పలు దేశాలకు చెందిన మహిళలు రామప్పను సందర్శిస్తారని, ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎన్‌హెచ్ 163 మరమ్మతు పనులు, జంగాలపల్లి నుంచి రామప్ప గుడి వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో పాటు గుడి నుంచి హరితహోటల్‌కు గల పీఆర్ రోడ్లను అధికారులు పరిశీలించి మరమ్మతు పనులను ఈ నెల 30లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాలంపేటలోని ఆర్చీకి పెయింటింగ్ వేసి సుందరీకరించాలని డీపీవోను ఆదేశించారు. హరిత కాటేజీలకు పెయింటింగ్ వేయించాలన్నారు. ప్రపంచ దేశాల పర్యాకులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేసి మిస్ వరల్డ్ బృందం పర్యటనను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్, అదనపు కలెక్టర్లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఇన్‌టాక్ కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారావు, డీఎస్పీ రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోప నివారణే పోషణ్ అభియాన్ లక్ష్యం

కాటారం/ మొగుళ్లపల్లి/ గణపురం/ ఏప్రిల్ 15 : పౌష్టికాహార లోప నివారణే పోషణ్ అభియాన్ లక్ష్యమని ఐసీడీఎస్ మహదేవ్‌పూర్ సీడీపీవో సాధిక, కాటారం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక, గణపురం ఎంపీడీవో ఎల్ భాస్కర్, డీడబ్ల్యూవో మల్లీశ్వరి, మొగుళ్లపల్లి సూపర్‌వైజర్ మాధవి అన్నారు. కాటారం మండల కేంద్రంలోని అయ్యప్ప కల్యాణ మండపంలో ఐసీడీఎస్ గంగారం, కాటారం సెక్టార్ల పరిధి అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో, గణపురం మండలకేంద్రంలోని రైతు వేదిక, మొగుళ్లపల్లి మండలం నర్సింగాపూర్‌లో మంగళవారం పోషణ్ అభియాన్ పక్షోత్సవాలు నిర్వహించారు. కాటారంలో 50 మందికి పైగా అంగన్‌వాడీ టీచర్లు పండ్లు, కూరగాయలు, పోషకాహార పదార్థాలు, చిరుధాన్యాలను ప్రదర్శిస్తూ వాటితో కలిగే ప్రయోజనాలను మహిళలకు వివరించారు. ఈ సందర్భంగా సీడీపీవో రాధిక, డాక్టర్ మౌనిక, ఎంపీవో వీరస్వామి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు శివరాణి, వీణ, భాగ్యలక్ష్మి, నాగరాణి పెరటితోటల పెంపకం, పౌష్టికాహార ఆవశ్యకత, చిరుధాన్యాలతో వంటలు, గర్భిణులు, బాలింతలకు వెయ్యి రోజుల ప్రాముఖ్యతను వివరించారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాలు, గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఎంపీవో వీరస్వామి, సీహెచ్‌వో నిర్మల, పోషణ్ అభియాన్ కో-ఆర్డినేటర్ స్వప్న, ఎన్టీవో సమ్మయ్య, జీపీ కార్యదర్శి రాకేశ్, గణపురం సూపర్‌వైజర్లు లక్ష్మి, అప్సర సుల్తానా, అంగన్‌వాడీ టీచర్లు, ఏడబ్ల్యూహెచ్‌లు, ఏఎన్ ఎంలు, మహిళలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్లు బంధం శ్రీహర్షిని తండ్రి స్వర్గీయ బంధం బాపు మరియు బంధం హనీష్ భార్గవ్ తండ్రి స్వర్గీయ బంధం బాపు, నివాసం: ఇం.నెం. 20-183/1, జవహర్ రోడ్, మంచిర్యాల టౌన్ వారి సూచనల మేరకు సాధారణ ప్రజలకు ఇందు మూలంగా తెలియజేయునదేమనగా మేడిగడ్డ గ్రామం, మహదేవ్‌పూర్ మండలం, జయశంకర్ భూపాలపల్లి జిల్లా వద్ద గల సర్వే నెం.68/1/2లో ఎక.1-13 గుంటలు విస్తీర్ణంకు బంధం బాపు ఆస్తి పట్టాదారు (దానిని తన తండ్రి బంధం పాపయ్య నుండి వారసత్వంగా పొందారు). శ్రీమతి చెలిమల ప్రమీళ భర్త క్రిష్ణా రెడ్డి నా క్లయింట్ల సమ్మతి మరియు సంతకాలు లేకుండా మోసపూరితంగా 19-04-2022 తేదీనాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ ద్వారా ఆమె పేరున పై సదరు భూమిని బదిలీ చేయించుకున్నారు. దీని గురించి ఇటీవలె నా క్లయింట్లకు తెలియ వచ్చింది. ఇట్టి భూమిపై హక్కు నా క్లయింట్లకు వంశ పారంపర్యంగా వచ్చింది. వారిపై చట్టప్రకారం చర్య తీసుకుంటారు. అందువల్ల పై భూమికి సంబంధించి అమ్మకం, తనఖా, గిఫ్ట్ మొ.ద్వారా ఏదేని లావాదేవీ కుదుర్చుకోరాదని సాధారణ ప్రజలకు ఇందు మూలంగా హెచ్చరించడమైనది. నా క్లయింట్లు 19-04-2022 తేదీనాటి సేల్ డీడ్ రద్దు కొరకు దావా దాఖలు చేస్తున్నారు.

సం/- ఎన్. జనార్ధన్ రెడ్డి, అడ్వకేట్
ఇం.నెం.1-7-139/41, ఎస్ఆర్‌కే నగర్, గోల్కొండ క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాద్-500048
మొబైల్ నెం.9848484926

జంక్షన్ల అభివృద్ధి కలేనా..?

- నిలిచిపోయిన సుభాష్‌కాలనీ రోడ్డు పనులు
- మంజూరైన నిధులు ఏమైనట్లు..?
- ఇప్పుడు కృష్ణకాలనీ రోడ్డుపై దృష్టి
- 60 ఫీట్లతో నిర్మించాలని వ్యాపారుల డిమాండ్

భూపాలపల్లి పట్టణంలోని జయశంకర్ సెంటర్

జయశంకర్ భూపాలపల్లి. ఏప్రిల్ 15 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో జంక్షన్ల అభివృద్ధి కలగానే మిగిలింది. భూపాలపల్లిలో మూడు జంక్షన్ల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసి యాక్షన్ ప్లాన్ తయారు చేసింది. పనులు కొనసాగిస్తున్న క్రమంలో ఎన్నికలు రావడంతో ప్రభుత్వం మారింది. జంగేడు పాత రోడ్డు నుంచి కాశీంపల్లి వరకు డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులు జరిగాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల కాలంలో పనులను పెండింగ్‌లో పెట్టింది. ఈ మూడు జంక్షన్లతో పాటు మంజూర్‌నగర్ జంక్షన్ అభివృద్ధిని మాస్టర్ ప్లాన్‌లో చేర్చినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది. సుభాష్‌కాలనీ రోడ్డు పనులు నిలిచిపోగా, అధికారులు ఇప్పుడు కృష్ణకాలనీ రోడ్డు నిర్మాణంపై దృష్టిపెట్టారు. శుక్రవారం 80 మీటర్ల రోడ్డుకు కొలతలు వేసి ముగ్గు పోస్తుండగా వ్యాపారులు, గృహ యజమానులు అడ్డుకున్నారు. 60 ఫీట్ల వరకు మాత్రమే ముగ్గు పోయాలని, గతంలోనే ఈ నిర్ణయం జరిగిందని మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. 80 ఫీట్లతో రోడ్డు వేస్తే చాలా నష్టం జరుగుతుందని, సుమారు 50 చిరు వ్యాపారుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

ఆ నిధులు ఏమైనట్లు ?

జయశంకర్, అంబేద్కర్, గణేశ్ చౌక్ జంక్షన్ల అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10కోట్ల నిధులు మంజూరు చేసిందని, పాత జంగేడు రోడ్డు నుంచి కాశీంపల్లి వరకు పనులు పూర్తి చేశామని, మిగిలిన పనులు పూర్తిచేయడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తున్నారు. సుభాశ్‌కాలనీ రోడ్డు పనులు చేస్తు న్న కాంట్రాక్టర్‌ను మార్చి మరో కాంట్రాక్టర్‌కు ఇచ్చారని, అయినా పనుల్లో పురోగతి లేదని, ప్రజల నుంచి వచ్చిన వ్యతిరేకతతో ఇటీవల తూతూ మంత్రంగా డ్రైనేజీ పనులు ప్రారంభించారని, అవి ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. అసలు రూ.6 కోట్ల అభివృద్ధి నిధులు ఎటు మళ్లించారో ప్రజలకు తెలుపాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు. ప్రభుత్వం ఏర్పడి 15నెలలు గడుస్తున్నా కనీసం సుభాశ్‌కాలనీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకపోవ డం కాంగ్రెస్ పాలనకు అద్దం పడుతున్నదని విమర్శిస్తున్నారు.

జంక్షన్‌ల అభివృద్ధి ఏది?

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్య ఉన్న సెంటర్లను గుర్తించిన గత ప్రభుత్వం మూడు జంక్షన్ల అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అంబేద్కర్‌సెంటర్, జయశంకర్‌సెంటర్, గణేశ్‌సెంటర్ల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఒక్కో సెంటర్‌కు మొదటి విడతగా రూ.10లక్షల చొప్పున కేటాయించింది. ఈ క్రమంలో గణేశ్‌సెంటర్ నుంచి రోడ్డు విస్తరణ, సెంట్రల్ లైటింగ్ పనులు పూర్తి చేసిన అధికారులు అంబేద్కర్ సెంటర్ నుంచి ఓసీ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పనులు పూర్తి చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి జంక్షన్ అభివృద్ధి చేపట్టాలని ప్లాన్ చేశారు. అయితే ఈ రోడ్డు విస్తరణ పనులకు బ్రేక్ పడడంతో జంక్షన్ల అభివృద్ధి ఆగింది.

నిధులు మళ్లించుకోవచ్చు

భూపాలపల్లిలో జంక్షన్ అభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో జరుగుతున్న సుభాశ్‌కాలనీ రోడ్డుకు సంబంధించి రూ. 6 కోట్ల నిధులను ఇతర ప్రాంతానికి మళ్లించినట్లు వస్తున్న ఆరోపణలపై కమిషనర్‌ను వివరణ కోరగా పైనుంచి అప్రూవల్ తీసుకుని మళ్లించవచ్చు అని సమాధానమిచ్చారు. కానీ, అది నా నోటీస్‌లో లేదన్నారు. గతంలోనే అంబేద్కర్, జయశంకర్, గణేశ్ చౌక్‌ల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయన్నారు. కొత్తగా మంజూర్ నగర్ వద్ద వర్షిణి గ్రాండ్ జంక్షన్‌ను చేర్చినట్లు చెప్పారు. పనులు ప్రారంభిస్తామని, సుభాశ్ కాలనీ రోడ్డు వెంట డ్రైనేజీ పనులు కొనసాగుతున్నాయన్నారు. కృష్ణకాలనీ రోడ్డుకు 80 మీటర్ల రూల్ ప్రొవిజన్ ఉంది.. కానీ ఇంకా ఫైనల్ కాలేదని చెప్పారు.

– బిర్రు శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్

'భూ భారతి'పై ప్రజలకు అవగాహన కల్పించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 15 : భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మంగళవారం భూ భారతి నూతన రెవెన్యూ చట్టం, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికపై అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 30 వరకు ప్రతి మండలంలో భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి తహసీల్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు చేయాలన్నారు. మండలస్థాయిలో రెవెన్యూ సమస్యలపై సమగ్రమైన నోట్స్ తయారు చేయాలని, నూతన చట్టం ప్రకారం మాత్రమే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, సక్సెషన్లు, సాదా బైనామా చేయాలన్నారు. హెల్ప్ డెస్క్‌కు వచ్చే ప్రజల వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామం నుంచి లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని, దాని ప్రకారం విచారణకు గెజిటెడ్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. ప్రతి అధికారికి 200 మంది లబ్ధిదారుల జాబితా ఇవ్వనున్నామని, ప్రతి రోజూ కనీసం 25 మంది లబ్ధిదారుల విచారణ చేపట్టి ప్రక్రియను 8 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 21 వరకు లబ్ధిదారుల జాబితా అందజేయాలని, 22 నుంచి 30 తేదీ వరకు ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి అర్హుల ఎంపిక చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పది కిలోల గంజాయి పట్టివేత ?

పోలీసుల అదుపులో ముగ్గురు

గణపురం, ఏప్రిల్ 15 : మండలంలోని గొల్లపల్లి సమీపంలో మంగళవారం పది కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నట్లు విశ్వనీయ సమాచారం. ముగ్గురు వ్యక్తులు గొల్లపల్లి జంక్షన్ నుంచి భూపాలపల్లి వైపు గంజాయిని తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు తెలిసింది. వారి నుంచి పది కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

హత్య కేసు నిందితుడికి జీవిత ఖైదు

మహదేవపూర్, ఏప్రిల్ 15 : మండలంలో హత్య కేసు నిందితుడికి కోర్టు జీవిత ఖైదు శిక్ష విధించింది. ఎస్సై పవన్ కుమార్ కథనే ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లా సీతానాగారం గ్రామానికి చెందిన సంగిశెట్టి కిశోర్ (22) మండలంలోని బ్రాహ్మణపల్లి ఇసుక క్వారీలో సూపర్‌వైజర్ పని చేసేవాడు. 2018లో కిశోర్ స్నేహితుడు ఇసుక క్వారీ ఇన్‌చార్జి విజయనగరానికి చెందిన చోడవరపు నర్సింహమూర్తి మండలంలోని ఎడపల్లి గ్రామానికి చెందిన గోగుల లలితను ప్రేమ వివాహం చేసుకోవడానికి విజయనగరానికి తీసుకెళ్లాడు. అందుకు నర్సింహమూర్తి స్నేహితుడు కిశోర్ సహకరించాడనే కోపంతో సదరు యువతి తమ్ముడు గోగుల విజయ్ 26 ఆగస్టు 2018 రాత్రి కిశోర్ ఇసుక క్వారీ వద్ద ఉండగా గొడ్డలితో నరికి హతమార్చాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి దుర్గారావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ తరలించారు. సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టగా భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీ నారాయణబాబు నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ రామచంద్రరావు, ఎస్సై పవన్‌కుమార్, పోలీసులను ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

గోవిందరావుపేటలో చందూలాల్ వర్ధంతి

నివాళులర్పిస్తున్న నాయకులు

గోవిందరావుపేట, ఏప్రిల్ 15 : దివంగత మాజీ మంత్రి అజ్మీరా చందూలాల్ వర్ధంతిని మండలకేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మేరకు చందూలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఇంటికి గుర్తుండే విధంగా ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఎంపీగా, ట్రైకార్ చైర్మన్‌గా ఆయన సేవలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు, సురేశ్, మోహన్, మల్లేశ్, శ్రీనివాస్, గట్టయ్య, సాంబయ్య, రాణి, కృష్ణారావు, రాజశేఖర్, తిరుపతి, కృష్ణారెడ్డి, మానునాయక్, బాలాజీ, రమేశ్, ఇంద్రారెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, రవి, లక్ష్మయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.

పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలి

చిన్న కాళేశ్వరం పనులను అడ్డుకున్న రైతులు

కాటారం, ఏప్రిల్ 15 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గారెపల్లి నూతన రిజర్వాయర్ వద్ద చేపడుతున్న పనులను భూ నిర్వాసిత రైతులు మంగళవారం అడ్డుకున్నారు. జేసీబీతో కట్ట మట్టి తొలగించే పనులు, సర్వే పనులను అడ్డుకొని భూములు కోల్పోయినా తమకు నష్ట పరిహారం ఇచ్చాకే పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా పరిహారం రాక, పంటలు సాగు చేసుకోలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, నష్ట పరిహారం ఇచ్చే వరకు పనులు జరగనీయమన్నారు. నీటి పారుదల శాఖ డీఈఈ ఉపేందర్ రైతులకు నచ్చజెప్పినా వినలేదు. కలెక్టర్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు పైడాకుల సురేశ్, గోనె మల్లయ్య, అడువాల మొగిలి, బొతు ప్రభాకర్, సత్యం, గౌరోజు పెద్ద రామన్న, దుర్గం రాజయ్య, లక్ష్మి, మల్లక్క, సమ్మక్క పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలు నివారించాలి

కృష్ణకాలనీ/ ములుగు రూరల్/ ఏటూరునాగారం, ఏప్రిల్ 15 : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్ వచ్చే లోపు అప్రమత్తతో అగ్ని ప్రమాదాన్ని నివారించాలని భూపాలపల్లి లీడింగ్ ఫైర్‌మెన్ సుజిత్‌కుమార్, ములుగు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కుమారస్వామి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం భూపాలపల్లి ఆర్టీసీ బస్టాండ్, ములుగు ఆర్టీసీ బస్టాండ్ వద్ద జాతీయ రహదారి మాక్‌డ్రిల్ ని ర్వహించారు. ఏటూరునాగారం మండలకేంద్రంలో వా ల్ పోస్టర్లను అంటించారు. వేర్వేరుగా జరిగిన కార్య క్రమాల్లో వారు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. 101 టోల్‌ఫ్రీ నంబర్‌పై అవగాహన కల్పించారు. లీడింగ్ ఫైర్‌మెన్ మహేశ్వర్, డీవోపీ సురేందర్, ఫైర్‌మెన్లు మహేందర్, రాజు, పవన్, సాయికుమార్, హోం గార్డు ధన్‌సింగ్, సురేశ్, సుధాకర్, ప్రతాప్, ప్రశాంత్, వెంకటయ్య, ఎస్ఎఫ్‌వో సత్యయ్య అవగాహన కల్పించారు. సిబ్బంది రవి కుమార్, అనిల్, భార్గవ్, రాజు, రాజేందర్, కంట్రోలర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

కాటారం, ఏప్రిల్ 15 : కాటారం-మంథని రహదారిపై ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వాహనదారుల కథనం ప్రకారం.. మల్హార్ మండలం వల్లెంకుంట గ్రామానికి చెందిన కొండ అశోక్ ద్విచక్ర వాహనంపై కాటారం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో కాటారం శివారులోని పత్తి మిల్లు వద్ద అశోక్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. అశోక్ తలకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అలాగే పులి స్వరూప మేడిపల్లిలో ఉంటున్న తన కూతురిని చూసేందుకు భూపాలపల్లిలో ఆర్టీసీ బస్సు ఎక్కింది. మేడిపల్లి వద్ద ఆపకపోవడంతో బస్సు కండక్టర్‌ను బతిమాలి ఆపాలని కోరింది. టోల్ ప్లాజా వద్ద బస్సు ఆగగా దిగే క్రమంలో ఒక్కసారిగా డ్రైవర్ ముందుకు వెళ్లడంతో కింద పడి కాలుకు తీవ్రగాయమై రక్తస్రావమవగా అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

సింగరేణి కేటీకే ఓసీ-2 గనిలో దొంగలు ?

కృష్ణకాలనీ, ఏప్రిల్ 15 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే ఓసీ-2లో మంగళవారం రెండో షిఫ్టులో దొంగలు పడిన విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. కేటీకే ఓసీ-2లో రెండో షిఫ్టులో గుర్తు తెలియని వ్యక్తులు గని ఆవరణలో ఉన్న విలువైన ఇనుమును దొంగతనం చేసి సంచిలో తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో ఓసీ-2 ప్రధాన గేటు వద్ద సెక్యూరిటీ గార్డుకు వారిపై అనుమానం వచ్చి తనఖీ చేయగా 40 నుంచి 50 కిలోల ఇనుము దొరికింది. వారి వద్ద నుంచి ఆ ఇనుమును స్వాధీనం చేసుకొని సింగరేణి ఎస్ అండ్ పీసీ అధికారులకు సమాచారం ఇవ్వగా అధికారులు వెంటనే ఓసీ-2 వద్దకు చేరుకొని వారిని అదుపులోకి తీసుకోని తమ వాహనాల్లో తీసుకెళ్లినట్లు సమాచారం. దొంగతనం చేసింది ఆ గనిలో పనిచేస్తున్న కార్మికులా ? లేక బయటి వ్యక్తులా ? ఔట్‌సోర్సింగ్ కార్మికులా? అనే విషయం తెలియాల్సి ఉంది. ఈ విషయమై సింగరేణి ఎస్అండ్ పీసీ అధికారులు పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అలాగే కేటీకే-6 ఇంక్లైన్ గనిలో కూడా మంగళవారం రాత్రి కొంతమంది వ్యక్తులు ఇనుము దొంగిలించి తీసుకెళ్తుండగా అక్కడే ఉన్న సెక్యూరిటీ గార్డు వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా దొంగలు తప్పించుకున్నారు. ఈ విషయమై సెక్యూరిటీగార్డు సింగరేణి ఎస్ అండ్ పీసీ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు దొంగల కోసం అర్ధరాత్రి వరకు గాలించినట్లు సమాచారం. అంతేకాకుండా రెండు రోజుల క్రితం కేటీకే-5 ఇంక్లైన్‌లో కేబుల్ వైరు దొంగలించారు.

తండ్రీ కొడుకులపై గొడ్డలితో దాడి

ప్రేమ వివాహమే కారణం

ములుగు, ఏప్రిల్15 (నమస్తే తెలంగాణ): ప్రేమించి పెళ్లి చేసుకొని వెళ్లి పోయిన వారి ఆచూకీ కోసం అబ్బాయి తండ్రి, సోదరుడిపై అమ్మాయి సోదరులు గొడ్డలితో దాడి చేశారు. ఈ ఘటన ములుగు మండలం దేవనగర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. బాధితుడు ముక్కాముల సురేశ్‌యాదవ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తాను హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ పాఠశాలలో పని చేస్తున్నానన్నారు. ఉదయం స్వగ్రామానికి రాగా తండ్రి సమ్మయ్యను రంగాపురంలోని గొర్ల మంద వద్దకు బైక్‌పై తీసుకెళ్తుండగా గ్రామానికి చెందిన మద్దెవేని సతీశ్, ప్రసాద్ మరో బైక్‌పై వచ్చి తమను అడ్డగించి తన తండ్ర వద్ద గొడ్డలి లాక్కొని దాడి చేశారన్నాడు. తన తండ్రి చేయి విరుగగా అడ్డుకోబోయిన తన చేతికి గాయమైందన్నారు. భయాందోళనకు గురైన తాను ఇంటికి పరుగు తీసి డయల్ 100కు సమాచారం ఇచ్చానన్నాడు. పోలీసులు తమ వద్దకు వచ్చి తమను ములుగు దవాఖానకు తీసుకువచ్చినట్లు చెప్పాడు. హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటివ్‌గా పనిచేస్తున్న తన తమ్ముడు నవీన్ గ్రామంలోని తమ కులానికి చెందిన కొమురయ్య కుమార్తె సౌజన్యను నాలుగు నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడని తెలిపారు. పెళ్లి అనంతరం పోలీసులను ఆశ్రయించగా వారు ఇరు కుటుంబాలను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి ఇద్దరు మేజర్లు అయినందున వారి జోలికి ఎవరూ వెళ్లొద్దని చెప్పారన్నారు. వారిద్దరూ అక్కడి నుంచి వెళ్లిపోయారని, ప్రస్తుతం వారు ఎక్కడున్నారో తమకు తెలియదన్నారు. ఇది మనసులో పెట్టుకున్న సౌజన్య సోదరులు కావాలని తమపై దాడి చేశారని తెలిపారు. ఈ విషయమై ములుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు సురేశ్ పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

ములుగురూరల్/ వెంకటాపూర్, ఏప్రిల్15 : గుడుంబా స్థావరాలపై ములుగు పోలీసులు మంగళవారం ఉదయం దాడులు చేశారు. ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాంనగర్‌తండాలో 400లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 30 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామానికి చెందిన అజ్మీరా దశరథ్, లావుడ్య వినోద్‌కుమార్, లావుడ్య భగవాన్‌సింగ్, అజ్మీరా సునీల్, పాల్తీయ తిరుపతిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్సై-2 లక్ష్మారెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అలాగే వెంకటాపూర్ మండలం నల్లగుంట గ్రామంలో గుడుంబా స్థావరాలపై దాడి చేసి వంద లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జక్కుల సతీశ్ తెలిపారు. పోరిక బుజ్జిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఎలుగుబంటి మృతిపై విచారణ

మహాముత్తారం, ఏప్రిల్ 15 : మండలంలోని యత్నారం అటవీ ప్రాంతంలో ఎలుగుబంటి మృతిపై అటవీ శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు పెగడపల్లి ఇన్‌చార్జి రేంజర్ వెంకటేశ్వర్లు తెలిపారు. వారిని అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు చెప్పారు. పూర్తి విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామన్నారు.

విధుల్లో అధికారుల నిర్లక్ష్యం

వాజేడు, ఏప్రిల్ 15 : ఆదివాసీల పట్టా భూముల్లో వలస గిరిజనేతరులు చెరుకురు గ్రామ పంచాయతీలో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేస్తుంటే పంచాయతీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆదివాసీ నవనిర్మాణసేన రాష్ట్ర అధ్యక్షుడు కొర్స నర్సింహమూర్తి ఆరోపించారు. మండలకేంద్రంలో మంగళవారం ఎంపీడీవో విజయ, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారయణను వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. చెరుకురు (జి) సర్వే నంబర్ 106/3లోని కోరం చంద్రక్క చెందిన రెండు గుంటల పట్టా భూమిని వలస గిరిజనేతరుడు అక్రమించి షెడ్డు నిర్మిస్తున్నాడని ఎంపీడీవో విజయకు ఫిర్యాదు చేసి నాలుగు నెలలైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఎల్‌టీఆర్ చట్టాలను అమలు చేయలేని అధికారులను బదిలీ చేయాలని డిమాండ్ చేశాడు. పనిచేసే అధికారులను ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. నాయకులు కుంజ మహేశ్, కోరం యుగంధర్, మనోజ్, శివలక్ష్మి పాల్గొన్నారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వాల్‌పోస్టర్లు

వెంకటాపురం(నూగూరు), ఏప్రిల్ 15 : మండలంలోని పలు గ్రామాల్లో మావోయిస్టులక